సాక్షి
వికారాబాద్

ఆదివారం । 1 । సెప్టెంబర్ । 2024



'స్థానిక' ఉత్కంఠ
గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు రిజర్వేషన్ల పీటముడి ఇంకావీడలేదు. దీంతో ఆశావహుల్లో ఆందోళననెలకొంది. 10లో▸



సైబర్ నేరాలపై..
సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఈజీ మనీకి ఆశపడరాదని ఎస్పీ నారాయణరెడ్డి సూచించారు. 10లో▸



ఉత్సవాలకు వేళాయె
బషీరాబాద్ మండలం నీళ్లపల్లి ఏకాంబర రామలింగేశ్వర స్వామి జాతర నేటి(ఆదివారం) నుంచి ప్రారంభంకానుంది. 11లో▸

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం
తాండూరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీవీ గీతాలక్ష్మి పట్నాయక్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంగ్లిష్, తెలుగు, వాణిజ్య శాస్త్రం, రాజనీతి శాస్త్రం, గణితశాస్త్రం, హిందీ, జంతుశాస్త్రం, వృక్షశాస్త్రం, ఉర్దూ సబ్జెక్టుల్లో ఒక్కో పోస్టు, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్ సబ్జెక్టులో రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. సంబంధిత సబ్జెక్టులో 55 శాతం మార్కులు, బోధనానుభవం ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సెట్, నెట్, పీహెచ్‌డీ ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. దరఖాస్తులను ఈనెల 2వ తేదీ సాయంత్రం 3గంటలలోపు కళాశాలలో అందజేయాలన్నారు. 3వ తేదీ ఉదయం 10గంటలకు వికారాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ధారూరు మార్కెట్‌కు 300 బస్తాల పెసర రాక
ధారూరు: స్థానిక వ్యవసాయ మార్కెట్‌కు శనివారం 300 బస్తాల పెసర వచ్చింది. గత వారం మార్కెట్‌కు 1,165 బస్తాల పెసళ్లు తెచ్చిన రైతులు మద్దతు ధర రాకపోవడంతో విక్రయించలేదు. గత వారం క్వింటాల్‌కు రూ.5,650 నుంచి రూ.7,450 వరకు అమ్మకాలు జరిగాయి. ఈ వారం క్వింటాల్‌కు రూ.7,725 నుంచి రూ.7,450 వరకు ధర పలికింది. కొంతమంది రైతులు పంట దిగుబడిని విక్రయించారు. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాల్‌కు రూ.8,558 ఉందని మరి కొందరు విక్రయించలేదు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి
సంగారెడ్డి సివిల్ కోర్టు జడ్జి తేజశ్రీ రెడ్డి



అనంతగిరి: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని ఛేదించాలని సంగారెడ్డి సివిల్ కోర్టు జడ్జి పట్లోళ్ల తేజశ్రీ రెడ్డి అన్నారు. శనివారం వికారాబాద్‌లోని గౌతమి జూనియర్ కళాశాల ఏర్పాటు చేసిన నూతన విద్యార్థుల స్వాగత సభకు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలన్నారు. ఇంటర్ విద్య జీవితంలో ఎంతో కీలకమైంది అన్నారు. తాను కూడా ఈ కళాశాల పూర్వ విద్యార్థిని అని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ రాజా వర్ధన్ రెడ్డి, ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తీజ్ ఉత్సవం
పాల్గొన్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



తీజ్ ఉత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తదితరులు

పరిగి: పట్టణంలో శనివారం గిరిజన సంఘం ఆధ్వర్యంలో తీజ్ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. గిరిజన సంప్రదాయాన్ని ప్రపంచానికి చూపించే విధంగా తీజ్ పండుగ జరుగుతుందన్నారు. తొమ్మిది రోజులు నియమ నిష్టలతో యువతులు ధాన్యాలను మొలకెత్తించి పండుగ జరుపుకొంటారని తెలిపారు. సంస్కృతి, సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలని సూచించారు. మన పూర్వీకులు చూపిన మార్గంలోనే నడవాలన్నారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, ప్రధాన కార్యదర్శి హన్మంతు ముదిరాజ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ, మండల అధ్యక్షుడు పరశురాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్‌ను కలిసిన ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



చేవెళ్ల: గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. రాజ్‌భవన్‌కు వెళ్లి గవర్నర్‌కు పూలమొక్కను బహూకరించారు.

విస్తారంగా వర్షాలు

రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా..
- పంటలకు జీవం పోసిన వరుణుడు
- చౌడాపూర్‌లో 70.2 మిల్లీమీటర్లు నమోదు
- ఈ సీజన్‌లో ఇది రెండో అత్యధిక వర్షపాతం
- అధికారులను అప్రమత్తం చేసిన కలెక్టర్, ఎస్పీ

వికారాబాద్: జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. గడిచిన 24 గంటలుగా వాన పడుతోంది. దీంతో పంటలకు జీవం పోసినట్లయ్యింది. వరినాట్లు వేస్తున్న రైతులకు ఈ వర్షాలు మేలు చేయనున్నాయి. ప్రస్తుత సీజన్‌లో ఇది రెండో అత్యధిక వర్షపాతం నమోదైంది. జిల్లాలోని ఒకటి రెండు చోట్ల భారీ వర్షపాతం నమోదయ్యింది. శుక్రవారం సాయంత్రం ప్రారంభమై శనివారం రోజంతా ముసురు వర్షం కురిసింది. రైతన్నకు కాస్త ఉపశమనం లభించింది. జూలైలో ఒకసారి భారీ వర్షం కురిసి వరుణుడు కనుమరుగై పోగా.. మళ్లీ నెల తరువాత ఇప్పుడు ఎడతెరపి లేని వాన పడింది. వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. చెరువుల్లోకి నీరు చేరుతోంది. చౌడాపూర్‌లో అత్యధికంగా 70.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కుల్కచర్లలో 65.6 మిల్లీ మీటర్లు, దుద్యాల్‌లో 55.3 దౌల్తాబాద్‌లో 53.3, పరిగిలో 55 మిల్లీమీటర్ల నమోదైంది. అన్ని మండలాల్లో సగటున 43.1 మి.మీ. పడింది. 7 మండలాల్లో సాధారణ, మిగతా 13 మండలాల్లో అధిక వర్షపాతం నమోదైంది.

రైతులకు ఊరట..
వానాకాలం సీజన్‌లో పంటలకు సరిపడా వర్షం కురిసినా చెరువుల్లోకి మాత్రం నీరు చేరలేదు. కొన్ని ప్రాంతాల్లో వర్షాలు పడ్డాయి.. మరి కొన్ని చోట్ల వానలు పడలేదు. దీంతో చెలకలు, ఇసుక పొలాల్లో మొక్కజొన్న తదితర పంటలు ఎండు మొఖం పట్టాయి. ప్రస్తుతం వరినాట్లు వేసుకునే సీజన్ కావడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ప్రస్తుత వర్షాలతో బోరుబావులు, చెరువుల్లోకి మరింత నీరు చేరి వరి నాట్లు ఊపందుకోనున్నాయి. వరి నాట్లు ఇప్పటికే పూర్తికావాల్సి ఉండగా ఈసారి వర్షాలు తక్కువగా పడటంతో 50 శాతం కూడా నాట్లు వేయలేదు. చెరువుల్లోకి నీరు చేరుతుండటంతో సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది..



అలుగు పారుతున్న చౌడాపూర్ మండలంలోని మరికల్ చెరువు

గడిచిన 24 గంటల్లో మండలాల వారీగా నమోదైన వర్షపాతం మిల్లీమీటర్లలో

మర్పల్లి	14.8
మోమిన్‌పేట్	42.2
నవాబుపేట	39
వికారాబాద్	42.2
పూడూరు	43.9
పరిగి	55
కుల్కచర్ల	65.6
దోమ	51.6
బొంరాస్‌పేట్	50
ధారూరు	45.6
కోట్‌పల్లి	27.9
బంట్వారం	21.4
పెద్దేముల్	22.6
తాండూరు	36.7
బషీరాబాద్	42.8
యాలాల	38.9
కొడంగల్	42.5
దౌల్తాబాద్	53.3
చౌడాపూర్	70.2
దుద్యాల	55.3

అప్రమత్తమైన అధికారులు
జిల్లాలో వర్షాల పరిస్థితులను అధికారులు ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారు. గత అనుభవాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. జిల్లాలోని 20 మార్గాల్లో 26 చోట్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నట్లు గుర్తించిన అధికార యంత్రాంగం నిఘాను పటిష్టం చేసింది. వర్షాలు తగ్గే వరకు పోలీస్, రెవెన్యూ శాఖలు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. జిల్లాలోని చెరువులు, కుంటలు, ప్రాజెక్టుల్లోకి నీరు చేరుతోంది. వికారాబాద్, తాండూరు, పరిగి పట్టణాల్లోని లోతట్టు ప్రాంతాలు వర్షపునీటితో చిన్నపాటి కుంటలను తలపిస్తున్నాయి. రోడ్లన్నీ బురదమయంగా మారాయి. పరిగి, వికారాబాద్, కొడంగల్ నియోజకవర్గాల్లో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. శనివారం ఉదయం పరిగి వికారాబాద్ మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.



మోమిన్‌పేట: అలుగు పారుతున్న నందివాగు ప్రాజెక్టు

అప్రమత్తంగా ఉండండి

- వర్షాలకు ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా చూడాలి
- అధికారులకు కలెక్టర్ ఆదేశం



కలెక్టర్ ప్రతీక్ జైన్

అనంతగిరి: జిల్లాలో ఎడతెరపి లేని వర్షాలు కురుస్తున్నందున అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో ఎస్పీతో కలిసి టెలీకాన్ఫరెన్స్ ద్వారా మండల అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న మూడు రోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లా అధికారులు, పోలీస్ శాఖ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. తహసీల్దార్లు, మండల అభివృద్ధి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఎక్కడా ఆస్తి, ప్రాణనష్టం జరగకూడదన్నారు. గ్రామాల్లో, మున్సిపాలిటీల్లో పాతబడిన మిద్దెలు, శిథిలావస్థకు చేరిన ఇళ్లను గుర్తించి, అందులోని వారిని ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలవకుండా చూడాలన్నారు. వర్షాలు పడుతున్నందున ఈగలు, దోమలు వ్యాప్తి చెంది అంటురోగాలు ప్రబలే ప్రమాదం ఉంటుంది, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఎక్కడైనా పంట నష్టం జరిగితే నివేదిక సిద్ధం చేసి పంపాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా చూడాలన్నారు. దెబ్బతిన్న, కుంగిపోయిన విద్యుత్ స్తంభాలను తొలగించి వాటి స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేయాలని చెప్పారు. వేళాడుతున్న విద్యుత్ తీగలను సరి చేయాలని అన్నారు. ఎక్కడైనా సమస్య తలెత్తితే వెంటనే సంబంధిత అధికారికి సమాచారం ఇవ్వాలని, కలెక్టరేట్‌లోని టోల్ ఫ్రీ నంబర్ 08416242136కు కాల్ చేయాలని సూచించారు.

చేసిన సేవలే గుర్తుండిపోతాయి
బాధ్యతాయుతంగా పనిచేసినప్పుడు ఎంతో సంతృప్తిని కలుగజేస్తుందని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. ఉద్యోగ విరమణ పొందిన జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి కార్యాలయ పబ్లిసిటీ అసిస్టెంట్ కే.జ్ఞానేశ్వర్‌ను శనివారం కలెక్టరేట్‌లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగులు బాధ్యతాయుతంగా పనిచేసినప్పుడు అధికారుల మన్ననలు పొందుతారని పేర్కొన్నారు. జ్ఞానేశ్వర్ తనకు ఇష్టమైన ఫొటోగ్రఫీ రంగంలో రాణించాలని సూచించారు. అంతకుముందు ఉద్యోగ విరమణ పొందిన మిషన్ భగీరథ ఈఈ బాబు శ్రీనివాస్‌ను కలెక్టర్ సన్మానించారు. ఈ సందర్భంగా తెలంగాణ సాంస్కృతిక కళాకారుల గేయాలు ఆహుతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, జిల్లా పౌర సంబంధాల అధికారి చెన్నమ్మ, డీవైఎస్‌ఓ హనుమంతరావు, డీఎస్సీడీఓ మల్లేశం, మెప్మా పీడీ రవికుమార్, మాజీ డీపీఆర్‌ఓ నర్సింలు, సమాచార పౌర సంబంధాల శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



జ్ఞానేశ్వర్ దంపతులను సన్మానించిన కలెక్టర్ తదితరులు

రైతు సమస్యలపై పోరాటం

రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగర్

ఇబ్రహీంపట్నం రూరల్: రైతు సమస్యలపై సమరశీల పోరాటాలు చేస్తామని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. సాగర్ స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం శిక్షణ తరగతులు ఆదిబట్ల మున్సిపల్ పరిధిలోని చింతపల్లిగూడ గేటు సమీపంలో గల శుభం కన్వెన్షన్ హాల్‌లో శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ముందుగా సంఘం జెండాను సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జంగారెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన శిక్షణ తరగతుల్లో సాగర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని, స్వామినాథన్ కమిషన్ సిఫారసు చేసిన సమగ్ర ఉత్పత్తి ఖర్చు సీ2 ఆధారంగా కనీస మద్దతు ధరల చట్టం చేయాలని, వడ్డీతో సహా రైతుల రుణాలన్నీ మాఫీ చేయాలని, రుణ విమోచన చట్టం చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించాలని, పంటల బీమా పథకాన్ని రైతాంగానికి ఉపయోగపడేలా మార్చాలన్నారు. రాష్ట్రంలో అర్హులందరికీ 2006 అటవీ హక్కు చట్టం ప్రకారం హక్కు పత్రాలు ఇవ్వాలన్నారు. కౌలు రైతులందరికీ 2011 చట్టం ప్రకారం రుణ అర్హత కార్డులిచ్చి రైతు భరోసా కల్పించాలన్నారు. సాగునీటి ప్రాజెక్టులు ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేయాలని కోరారు. పంటలు నష్టపోయిన సందర్భంలో నష్టపరిహారం, అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్నారు. ప్రాజెక్టులు, పరిశ్రమలు, రోడ్లు ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు భూసేకరణ జరిగేటప్పుడు 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగయ్య, ప్రొఫెసర్ అరబండి ప్రసాద్, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్రారెడ్డి, సహాయకార్యదర్శి శోభన్‌నాయక్, జిల్లా అధ్యక్షుడు రాంచందర్ పాల్గొన్నారు.

రవీంద్రభారతిలో కొడంగల్ జానపదం



పాటను ఆవిష్కరిస్తున్న రమణాచారి, తదితరులు

బొంరాస్‌పేట: ప్రపంచ జానపద కళాకారుల దినోత్సవం సందర్భంగా శనివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో కొడంగల్ జానపదం కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర జానపద కళా సమితి (టీజీఆర్‌జేకేఎస్)ఆధ్వర్యంలో కళాకారులు ప్రదర్శన ఇచ్చారు. ఈ కార్యక్రమాన్ని మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించారు. జిల్లాకు చెందిన తాండూరు, వికారాబాద్, కొడంగల్ జానపద కళాకారులు ప్రదర్శనలు చేశారు. ఈ నెల 29న కోస్గిలో నిర్వహించిన జానపద జాతర, కొడంగల్ ప్రాంతంలో ఉన్న జానపద కళారూపాల పాట 'ఘల్లు ఘల్లు కొడంగల్లు.. గజ్జెకట్టి దుంకులాడ్తె గుండెలు ఝల్లు'.. అనే వీడియో సాంగ్‌ను ఆ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కేవీ రమణాచారి ఆవిష్కరించారు. పాటలో అన్ని రకాల పల్లె కళలను మిళితం చేస్తూ రచన, గానం చేసిన బొంరాస్‌పేట మండలం అంజిలప్పను అభినందించారు. తెలంగాణ పల్లె కళలను యూట్యూబ్, సోషల్ మీడియా ద్వారా ప్రపంచానికి చాటాలని రమణాచారి అన్నారు. ప్రతియేటా నిర్వహించే జానపద జాతరలో కొడంగల్‌కు చెందిన నాజీఖాన్‌పల్లి శకనప్ప 'దుమ్మనగొయ్య' అనే పురాతన జానపద వాయిద్యాన్ని ప్రదర్శించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సాంస్కృతిక శాఖ అధికారి మామిడి హరికృష్ణ, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వంగ శ్రీనివాస్‌గౌడ్, సుంచు లింగయ్య, ప్రముఖ వ్యాపారవేత్త సారిపల్లి కొండల్‌రావు, జిల్లా అధ్యక్షుడు రమేశ్, ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణయ్య, దౌల్తాబాద్ సాయిలు, బాలేశ్వరి పాల్గొన్నారు.

అర్హులందరికీ రుణమాఫీ

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి

ఆమనగల్లు: అర్హులైన రైతులందరికీ ప్రభుత్వం రుణమాఫీ అందిస్తుందని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని సింగిల్‌విండో కార్యాలయంలో శనివారం సింగిల్‌విండో చైర్మన్, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్‌గుప్తాతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీమేరకు రూ.2లక్షలలోపు పంట రుణాలను మాఫీ చేస్తుందని స్పష్టం చేశారు. చిన్నచిన్న సాంకేతిక కారణాలతో మాఫీ కాని రైతుల కోసం వ్యవసాయాధికారులతో నిజనిర్ధారణ చేసి మాఫీ అయ్యేలా చర్యలు తీసుకుంటుందన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకుల ద్వారా ఇప్పటివరకు 34,731 మంది రైతులకు సంబంధించి రూ.206.39 కోట్ల రుణమాఫీ జరిగిందని తెలిపారు. రైతు కుటుంబాలకు చెందిన విద్యార్థుల ఉన్నత చదువులకోసం రూ.14.49 కోట్ల విద్యా రుణాలు ఇచ్చినట్టు వెల్లడించారు. గృహనిర్మాణాల కోసం రూ.21.01 కోట్లు, రైతులకు రూ.17 కోట్లు బంగారంపై రుణాలు అందించినట్టు ఆయన వివరించారు.

మళ్లీ టోల్ బాదుడు

- రాయికల్ టోల్ ప్లాజాలో రుసుము పెంపు
- పెరిగిన ధరలు నేటి నుంచి అమల్లోకి
- వాహనదారులకు తప్పని ఆర్థిక భారం

షాద్‌నగర్: టోల్ ప్లాజా రుసుములు ఏటా పెరుగుతున్నాయి. ఫలితంగా వాహనదారులపై అదనపు భారం పడుతోంది. ట్రక్కు, బస్సు, మల్టీ ఆక్సిల్ (అనేక చక్రాలు) వాహనాలకు ఈ ఏడాది స్వల్పంగా రుసుము పెంచారు. టోల్ ప్లాజాలో రుసుములు పెరుగుతుండటంతో వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హైదరాబాద్ – బెంగళూరు 44వ జాతీయ రహదారిపై షాద్‌నగర్ సమీపంలోని రాయికల్ టోల్‌ప్లాజాలో టోల్ రుసుము పెంచారు. పెంచిన ధరలు ఆదివారం నుంచే అమల్లోకి రానున్నాయి.



రాయికల్ టోల్ ప్లాజా

ప్రయాణికులపై మరింత భారం
బెంగళూరు జాతీయ రహదారిపై ప్రయాణించే వారిపై మరింత భారం పెరుగుతుంది. ఇప్పటికే పెట్రోల్, డీజిల్ ధరలు రోజు రోజుకూ పెరుగుతుండటంతో సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం టోల్ ధరలు పెంచుతుండటతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టోల్‌ప్లాజాలో ధరల పెంపు సరికాదని, జాతీయ రహదారిపై వాహనదారులకు మరిన్ని సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఏటా పెరుగుడే..
షాద్‌నగర్ నియోజకవర్గం కొత్తూరు నుంచి మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల వరకు ఉన్న జాతీయ రహదారిని (సుమారు 58 కిలోమీటర్లు) రూ.600 కోట్లతో విస్తరించి అవసరమైన చోట బైపాస్ నిర్మించారు. ఈ జాతీయ రహదారిని 2009లో కొత్తూరులో ప్రారంభించారు. షాద్‌నగర్ పరిధిలోని రాయికల్ గ్రామ శివారులో నిర్మించిన టోల్‌ప్లాజాలో ఏటా టోల్ రుసుము పెంచుతూ వస్తున్నారు. దీంతో బెంగళూరు –హైదరాబాద్ జాతీయ రహదారిపై ప్రయాణం మరింత భారం కానుంది. పెంచిన రుసుములు సెప్టెంబర్ 1వ తేదీ నుంచి అమల్లోకి రానున్నాయి.

నెలవారీ పాసుల ధరలు
టోల్ ప్లాజాలో వాహనాలకు నెలవారీ పాసులు జారీ చేస్తున్నారు. కారు, ప్యాసింజర్, జీపు లేక వ్యాన్‌కు రూ.2,465, లైట్ కమర్షియల్ వాహనాలు, మినీ బస్సులకు రూ.4,315, ట్రక్కు, బస్సుకు రూ.8,630, మల్టీయాక్సిల్ వాహనాలకు రూ.13,865 వసూలు చేయనున్నారు. స్కూల్ బస్సులకు రూ.వెయ్యి వసూలు చేస్తారు.

అప్పుడలా.. ఇప్పుడిలా..
టోల్‌గేట్‌లో ట్రక్కు, బస్సులకు ఒకవైపు ప్రయాణానికి గత ఏడాది రూ.285 వసూలు చేస్తే ఈసారి రూ.290 వసూలు చేయనున్నారు. మల్టీయాక్సిల్ వాహనం (అనేక చక్రాలు) రానుపోను ప్రయాణానికి గత ఏడాది రూ.690 వసూలు చేస్తే ఈసారి రూ.695కు పెంచారు.

నేటి నుంచి వసూలు చేయనున్న టోల్ రుసుము

వాహనం	ఒకవైపు ప్రయాణం	రానుపోను ప్రయాణం
కారు, జీపు ప్యాసింజర్ వ్యాన్	రూ. 80	రూ.125
లైట్ కమర్షియల్, మినీబస్	రూ.145	రూ.215
ట్రక్కు, బస్సు	రూ.290	రూ.430
మల్టియాక్సిల్ వాహనాలు	రూ. 460	రూ.695

రవాణా రంగంపై ప్రభావం



రవాణా రంగంపై ఆధార పడి ఎంతో మంది జీవనం సాగిస్తున్నారు. పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల, టోల్ రుసుములు తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. టోల్ రుసుము పెంపుతో వాహనదారులకు ఆర్థిక ఇబ్బందులు తప్పవు.

– సయ్యద్ సాధిక్, లారీ ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

స్వల్పంగా పెరిగాయి
టోల్ ప్లాజాలో స్వల్పంగా రుసుములు పెరిగాయి. బస్సు, ట్రక్కు ఒక వైపు ప్రయాణానికి, మల్టీయాక్సిల్ వాహనం రానుపోను ప్రయాణానికి ఐదు రూపాయల చొప్పున పెంచడం జరిగింది. పెరిగిన ధరలు సెప్టెంబర్ 1 నుంచి వసూలు చేయడం జరుగుతుంది.

– ఇబ్రహీం, టోల్‌ప్లాజా మేనేజర్, షాద్‌నగర్

క్లుప్తంగా

నేడు లక్ష బిల్వార్చన

ధారూరు: మండల కేంద్రంలోని కపిలేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం లక్ష బిల్వార్చన ప్రత్యేక పూజ నిర్వహిస్తామని ఆలయ అర్చకుడు చెన్న బసవయ్యస్వామి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8గంటల నుంచి పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయని చెప్పారు. ఉదయం 11.55 గంటలకు శివపార్వతుల కల్యాణోత్సవం ఉంటుందన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం, సాయంత్రం శ్రీ వీరభద్రేశ్వరస్వామిని పల్లకీ ఊరేగింపుంటుందని తెలిపారు.

రికవరీ చేసిన ఫోన్లు బాధితులకు అందజేత



బాధితులకు ఫోన్లు అందజేస్తున్న ఎస్‌ఐ సంతోష్‌కుమార్

పరిగి: సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న బాధితులు తమకు ఫిర్యాదు చేస్తే రికవరీ చేస్తామని ఎస్‌ఐ సంతోశ్‌కుమార్ అన్నారు. శనివారం ఆయన పోలీస్‌స్టేషన్ పరిధిలో సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న ఎనిమిది బాధితులకు రికవరీ చేసి ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..స్ కొనుగోలు చేసిన సమయంలో రసీదు, ఐఎంఈఐ నంబర్లు తీసుకుని భద్రపరుచుకోవాలన్నారు. దీంతో మొబైల్ సులువుగా రికవరీ చేయవచ్చునన్నారు.

పరస్పర దాడిలో ఇరువర్గాలపై కేసు

కొత్తూరు: జేపీ దర్గాలో చోటుచేసుకున్న ఘటనలో ఇరువర్గాలపై కేసు నమోదు చేశామని కొత్తూరు సీఐ నర్సింహారావు తెలిపారు. ఆయన వివరాలు ఇలా ఉన్నాయి. జేపీ దర్గా ప్రధాన కాంట్రాక్టర్ ఖాజాపాష వద్ద ఇదే ప్రాంతానికి చెందిన సయ్యద్ రఫీక్ సబ్ కాంట్రాక్టర్‌గా మెయింటనెన్స్ పనులు తీసుకున్నాడు. అయితే ఓ టీవీ చానల్‌లో విలేకరిగా పనిచేస్తున్న ఫయాజ్ తనతో పాటు స్థానికంగా ఉండే తన వర్గం వారికి రూ.5 లక్షలు (మామూళ్లు) ఇవ్వాలని కొద్ది రోజులుగా డిమాండ్ చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో వారికి ఇబ్బందులు కలిగిస్తున్నాడు. ఈ క్రమంలో గత శుక్రవారం ఫయాజ్‌కు సంబంధించిన వ్యక్తులు దర్గా ఆవరణలో రఫీక్, ఇతనికి చెందిన వ్యక్తులపై దాడికి పాల్పడ్డారు. దీంతో రఫీక్‌తో పాటు పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. అదే రోజు సాయంత్రం గొడవ విషయమై ఫయాజ్ తన మామ అయిన షౌకత్, నవాజ్‌లతో కలిసి రఫీక్, అతడి వర్గీయులతో మాట్లాడుతుండగా.. పాత కక్షల నేపథ్యంలో రఫీక్ వర్గీయులు ఫయాజ్‌తో పాటు అతడి బ్యాచ్‌పై దాడికి పాల్పడ్డారు. ఇరు వర్గాలు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

తహసీల్దార్‌పై ఆర్డీఓకు ఫిర్యాదు

నందిగామ: పట్టా భూమికి సంబంధించి నాలా కన్‌వర్షన్ కోసం దరఖాస్తు చేస్తే తహసీల్దార్ పట్టించుకోవడం లేదని శనివారం ఓ మహిళ ఆర్డీఓకు ఫిర్యాదు చేసింది. నర్సప్పగూడ గ్రామానికి చెందిన కావలి లతకు చేగూరు శివారులో సర్వే నెంబరు720/ఉ/ఆ/1/2/2 లో రెండు గంటల భూమి ఉంది. ఈ భూమి కన్‌వర్షన్‌కు దరఖాస్తు చేసుకోగా తహసీల్దార్ రాజేశ్వర్ పట్టించుకోవడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.

'స్థానిక' ఉత్కంఠ

- పంచాయతీ రిజర్వేషన్లపై ఎటూ తేల్చని ప్రభుత్వం
- డోలాయమానంలో ఆశావహులు
- ఓటరు జాబితా రూపకల్పనలో అధికారులు బిజీ



గౌడుగోనిపల్లి పంచాయతీ కార్యాలయం

దోమ: గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు రిజర్వేషన్ల పీటముడి ఇంకా వీడలేదు. ఓ వైపు ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటరు జాబితా రూపొందించే పనిలో అధికారులు తలమునకలవగా, మరోపక్క ఎన్నికల బరిలో దిగాలనుకునే వారు అనుచరులతో కలిసి పావులు కదుపుతున్నారు. మళ్లీ పోటీలో ఉండాలనుకుంటున్న మాజీ ప్రజాప్రతినిధులు సైతం బలాన్ని పెంచుకునే దిశగా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. కానీ రిజర్వేషన్ల అంశం ఇప్పటికి స్పష్టత లేకపోవడంతో వీరిలో ఉత్కంఠ నెలకొంది. రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి చేస్తే తమ ప్రయత్నాలను ముమ్మరం చేసుకోవచ్చని ఆశావహులు భావిస్తున్నారు.

నూతన విధానంపై సమాలోచనలు

పంచాయతీ రిజర్వేషన్లు పదేళ్ల పాటు అమలయ్యేలా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం చట్టం చేసింది. ఈ మేరకు ఐదేళ్ల క్రితం ఎన్నికలు నిర్వహించారు. ప్రస్తుతం అదే చట్టం ప్రకారం పాత రిజర్వేషన్లను అమలు చేయాలి. కానీ ప్రభుత్వం మారడంతో రిజర్వేషన్లను మారుస్తారనే ప్రచారం కొనసాగింది. ఈ విషయమై ఇప్పటికీ స్పష్టత రాకపోవడంతో అన్ని పార్టీలు, ఆశావహుల్లో ఆందోళన నెలకొంది. మరో వైపు గ్రామాల్లో వార్డుల వారీగా ఓటర్లను విభజించి.. కుటుంబంలో ఓటు హక్కు కలిగిన వారందరినీ ఒకే చోట చేర్చేలా అధికారులు జాబితా రూపొందిస్తున్నారు. మండలంలోని మొత్తం 36 పంచాయతీల్లో ఈ ప్రక్రియ చురుగ్గా సాగుతోంది. ఈ నెల 21న అధికారులు తుది జాబితాను ప్రకటించనున్నారు. బీసీ కులగణన పూర్తయ్యాకే రిజర్వేషన్లను ఖరారు చేస్తామని, అనంతరం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన విషయం విదితమే. రిజర్వేషన్లపై ప్రభుత్వం నుంచి ఇప్పటికీ స్పష్టత రాకపోవడంతో ఎన్నికల నిర్వహణపై సర్వత్రా టెన్షన్ నెలకొంది.

36 జీపీల్లో రిజర్వు స్థానాలు...

దోమ మండల వ్యాప్తంగా మొత్తం 36 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో గత ఎన్నికల్లో ఓసీ జనరల్, ఓసీ మహిళకు కలిపి 7, బీసీ జనరల్, బీసీ మహిళలకు 14, ఎస్సీ జనరల్, ఎస్సీ మహిళకు కలిపి 6, ఎస్టీ జనరల్, ఎస్టీ మహిళలకు కలిపి 9 పంచాయతీలను రిజర్వ్ చేశారు.

స్పష్టత రాలేదు



పంచాయతీ రిజర్వేషన్ల విషయంలో ఇప్పటికీ ఎలాంటి స్పష్టత రాలేదు. ప్రస్తుతం అన్ని జీపీల్లో ఓటరు జాబితా రూపకల్పన కొనసాగుతోంది. ఓటర్లను వార్డుల వారీగా విభజించి తుది జాబితాను ఉన్నతాధికారులకు అందజేస్తాం.

– మహేశ్‌బాబు, ఎంపీడీఓ, దోమ

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ఎస్పీ నారాయణరెడ్డి



నవాబుపేట ఠాణాలో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి

నవాబుపేట: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ నారాయణరెడ్డి ప్రజలకు సూచించారు. శనివారం ఆయన ఆకస్మికంగా నవాబుపేట పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన ఆయన అనంతరం స్టేషన్‌లోని రికార్డులను తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ నారాయణరెడ్డి విలేకరులతో మాట్లాడారు. ఈజీ మనీ ఆశతో మోసగాళ్ల మాటలకు మోసపోవద్దని సూచించారు. దొంగతనాల విషయంలో పకడ్బందీగా నిఘా పెట్టామన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లలో అల్యూమినియం వాడడంతో దొంగతనాలు దగ్గాయన్నారు. గ్రామాల్లో అనుమానిత వ్యక్తులు సంచరించినట్లు గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. ప్రజలతో మమేకమై నేరాల నిర్మూలనకు కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. ఫిర్యాదు దారులతో మర్యాదగా మెలగాలన్నారు. విధి నిర్వాహణలో పోలీసులు అలసత్వం వహిస్తే ఉపేక్షించేదిలేదని హెచ్చరించాడు. నవాబుపేట ఠాణా పనితీరు బాగుందని కితాబిచ్చారు. ఆయన వెంకట వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, మోమిన్‌పేట సర్కిల్ సీఐ నవీన్‌కుమార్, ఎస్‌ఐ అరుణ్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

బాలికకు ప్రేమ వేధింపులు

మనస్తాపంతో పురుగు మందు తాగిన విద్యార్థిని

బంట్వారం: తమ పాఠశాలలో చదువుతున్న సీనియర్ విద్యార్థి ప్రేమ పేరుతో వేధిస్తున్నాడని మనస్తాపం చెందిన ఓ బాలిక పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటన బంట్వారం మండల పరిధిలోని ఓ గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. బాలిక తండ్రి తెలిపిన వివరాల ప్రకారం.. ప్రభుత్వ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న తన కూతురును పదో తరగతి విద్యార్థి వేధిస్తున్నాడు. ఈ విషయాన్ని హెచ్‌ఎంకు చెప్పేందుకు శనివారం ఆయన స్కూల్‌కు వెళ్లాడు. ఇంటివద్దే ఉన్న బాలిక అంతలోనే పురుగు మందు తాగి పడిపోయింది. ఇది గమనించిన కుటుంబీకులు ఆమెను తాండూరులోని జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం బాలిక ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు వైద్యులు చెప్పారు. ఈ విషయమై ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డిని అడగగా.. తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

సుద్ద గుంతలో పడి వ్యక్తి మృతి



మృతదేహాన్ని వెలికితీస్తున్న పోలీసులు

- మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు
- దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు

పెద్దేముల్: సుద్దగుంతలో పడి ఓ వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందాడు. ఈ ఘటన శనివారం పెద్దేముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ గిరి తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని రుద్రారం గ్రామానికి చెందిన బండమీది నాగమ్మ–లక్ష్మన్నకు ముగ్గురు సంతానం. వీరి రెండో కుమారుడు రమేశ్(27) రెండు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. ఈ నెల 30న వైద్య చికిత్స నిమిత్తం గ్రామానికి చెందిన ఎర్ర వెంకటయ్యతో కలిసి మధ్యాహ్నం పెద్దేముల్ వెళ్లారు. వెంకటయ్య తిరిగి సాయంత్రం ఇంటికి రాగా రమేశ్ రాలేదు. దీంతో మృతుడి తల్లి వెంకటయ్యను తన కుమారుడు ఎటువెళ్లాడని ప్రశ్నించగా బుద్దారంలోని తన అక్క వద్దకు వెళ్లాడని చెప్పాడు. నాగులపల్లి–గోపాల్‌పూర్ రోడ్డు పక్కన ఓ సుద్దగుంతలో రమేశ్ మృతదేహం ఉన్నట్లు శనివారం గ్రామస్తులు చర్చించుకుంటుండగా తల్లి నాగమ్మకు తెలిసింది. ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు పంచనామా చేస్తుండగా తన కుమారుడి మృతిపై అనుమానం ఉందని తల్లి ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడికి నాలుగేళ్ల క్రితం వివాహమై భార్యకు విడాకులిచ్చినట్లు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



తాండూరు: సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



పరిగి: సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే టీఆర్‌ఆర్

- తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి
- 39 మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

తాండూరు: పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని 39 మంది పేదలకు రూ.16లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం అందజేస్తున్నామని చెప్పారు. తాండూరు నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని నిధులు తీసుకువచ్చి నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. రుణమాఫీతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారని వివరించారు. అర్హులై మాఫీ కాని రైతుల కోసం వ్యవసాయాధికారులు సర్వే చేస్తున్నారని చెప్పారు. ప్రతీ అర్హుడైన అన్నదాతకు మాఫీ చేస్తామన్నారు. భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నందున ప్రజలు భద్రత పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్న, మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి, కౌన్సిలర్లు ప్రవీణ్‌గౌడ్, బోయ రవిరాజ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు హబీబ్‌లాల, డీసీఎంఎస్ డైరెక్టర్ రవిగౌడ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ధారాసింగ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఖాంజాపూర్ గుట్టను అభివృద్ధి చేస్తాం

హిందూ ఉత్సవ సమితికి కేటాయించిన స్థలాన్ని చారిత్రాత్మక ప్రదేశంగా మారుస్తామని ఎమ్మెల్యే బీఎంఆర్ అన్నారు. శనివారం పట్టణ శివారులోని ఖాంజాపూర్ గుట్టపై హిందూ ఉత్సవ సమితికి కేటాయించిన స్థలాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ స్వప్న, హిందూ ఉత్సవ సమితి ప్రతినిధులతో కలిసి సందర్శించారు. గుట్టప్రాంతంలో మట్టి తవ్వకాలపై ఆయన విచారం వ్యక్తం చేశారు. ఆరేళ్ల క్రితం స్థల కేటాయింపు జరిగిందని.. స్థానికంగా మద్దతు లభించక అభివృద్ధి పనులు చేపట్టలేదని సమితి ప్రధాన కార్యదర్శి పటోళ్ల నర్సింలు ఎమ్మెల్యేకు వివరించారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే త్వరలోనే స్థలం చుట్టూ ప్రహరీ, మీటింగ్ హాల్, దేవతామూర్తుల ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించి అభివృద్ధి చేస్తామన్నారు. గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకునేందుకు హిందూ ఉత్సవ సమితి ప్రతినిధులు సహకరించాలన్నారు. క్యాంపు కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన హిందూ ఉత్సవ సమితి ప్రతినిధులను ఎమ్మెల్యే సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి, నాయకులు కరణం పురుషోత్తంరావు, హిందూ ఉత్సవ సమితి ప్రతనిధులు సంతోష్‌కుమార్, భాను, తదితరులున్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

పరిగి: అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తానని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుల కుటుంబ సభ్యులకు శనివారం ఆయన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు. కాంగ్రెస్ ఇచ్చిన ప్రతీ మాట నిలబెట్టుకుంటుందన్నారు.

రాకపోకలు మళ్లీ బంద్



డైవర్షన్ రోడ్డు మీదుగా వరద ప్రవాహం

- కాగ్నా ప్రవాహంతో నీటమునిగిన తాత్కాలిక డైవర్షన్ రోడ్డు
- త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ప్రజల విజ్ఞప్తి

ధారూరు: ధారూరు మండల పరిధిలోని స్టేషన్ ధారూరు–దోర్నాల్ గ్రామాల మధ్య కాగ్నా నదిపై నిర్మించిన డైవర్షన్ రోడ్డుపై నుంచి కాగ్నానది ప్రవహించడంతో శనివారం ఉదయం నుంచి రాకపోకలు నిలిచిపోయాయి. సాయంత్రం నీటి ప్రవాహం తగ్గడంతో పాదచారులు మాత్రమే ఈ మార్గం వినియోగించారు. కాగ్నానదిపై నిర్మిస్తున్న వంతెన పూర్తి కాకపోవడంతో పలు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత పాలకులు పట్టించుకోకపోవడం వలనే పనులు మందగించాయని, ప్రస్తుతం శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ చొరవ తీసుకుని పనులు ముమ్మరం చేయించినా పనులు పూర్తవ్వలేదని విచారం వ్యక్తం చేశారు. ధారూరు నుంచి దోర్నాల్, అంపల్లి, గురుదోట్ల, వీసీఎం తండా, నాగారం, మైలారం, మోమిన్‌కలాన్, రాజాపూర్, మోమిన్‌ఖుర్దు, తాండూర్ మండలంలోని రాస్నం బొంరాస్‌పేట్ మండలంలోని మదనపల్లి తదితర గ్రామాలకు వెళ్లాలంటే ఈ వంతెన దాటి వెళ్లాల్సి ఉంటుందని ప్రజలు వివరించారు.

పనుల్లో జాప్యం..

ఏడేళ్ల క్రితం స్టేషన్‌ధారూరు–దోర్నాల్ గ్రామాల మధ్య కాగ్నానదిపై శిథిలావస్థకు చేరిన వంతెనను తొలగించి మంజూరైన రూ.4.70 కోట్లతో కాంట్రాక్టర్ పనులు మొదలు పెట్టారు. గత ప్రభుత్వ హయాంలో చేసిన పనులకు సకాలంలో బిల్లు రాక అసంపూర్తిగా వదిలివేశారని, తర్వాత బిల్లు మంజూరు చేసిన డబ్బులు తీసుకున్న కాంట్రాక్టర్ పనిచేయకుండానే వెళ్లిపోయారని ప్రజలు ఆరోపించారు. ఆ కాంట్రాక్టర్‌పై ఎలాంటి చర్యలు తీసుకోలేదని.. మరో కాంట్రాక్టర్‌ను నియమించి పనులు కొంతమేరకు చేయించారని గుర్తుచేశారు. అతనికి సైతం బిల్లు చెల్లించకపోవడంతో పనులు మధ్యలోనే వదిలేశాడన్నారు. మూడో కాంట్రాక్టర్ పనులు చేస్తున్న క్రమంలోనే వానలు ప్రారంభమై పనులు ఆగిపోయాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేసి రాకపోకలను పునరుద్ధరించాలని కోరుతున్నారు.

తీగ తెగినా.. పట్టించుకోరా!

నాలుగు రోజులుగా రైతుల ఆందోళన



నెల్లిగడ్డ తండాలోని పొలంలో తెగిపడిన విద్యుత్ వైర్

పెద్దేముల్: విద్యుత్ వైర్లు తెగిపడి నాలుగు రోజులైనా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండల పరిధిలోని నెల్లిగడ్డ తండా నుంచి వ్యవసాయ పొలాలకు విద్యుత్ సరఫరా అవుతోంది. రూప్‌సింగ్ పొలం వద్ద నాలుగు రోజుల క్రితం విద్యుత్ వైర్ తెగిపడింది. దీంతో రైతులు లైన్‌మెన్ రాజేశ్వర్‌కు పలుమార్లు సమాచారం ఇచ్చినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

వృద్ధుడి అదృశ్యం

కుల్కచర్ల: పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లిన వృద్ధుడు అదృశ్యమయ్యాడు. ఈ ఘటన కుల్కచర్ల ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ సత్యశీలా రెడ్డి తెలిపిన ప్రకారం.. తుపాకుల తండాకు చెందిన వడిత్యా గొబ్ర్యా నాయక్ (71) ఈ నెల 29న రాత్రి పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లాడు. రాత్రి ఇంటికి రాలేదు. ఉదయమైనా రాకపోవడంతో కుటుంబీకులు ఆందోళనతో చెందారు. ఎక్కడ వెతికినా ఆచూకీ లభించకపోవడడంతో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతంలోనూ మతిస్థిమితం కోల్పోయి రెండు రోజుల్లో తిరిగి వచ్చేవాడని.. నాలుగు రోజులైనా జాడ తెలియకపోవడం ఆందోళన కలిగిస్తుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

తాండూరులో వింత చోరీ

- మొబైల్‌షాప్‌నకు కన్నం
- రెండు సెల్‌ఫోన్లు, రూ.2వేల నగదు మాత్రమే ఎత్తుకెళ్లిన నిందితుడు



చోరీకి పాల్పడిన నిందితుడు

తాండూరు టౌన్: సాధారణంగా ఇళ్లలో చోరీలు, ఏటీఎంలలో దొంగతనాల గురించి వింటుంటాం.. తాండూరులో జరిగిన చోరీ మాత్రం కాస్త భిన్నం.. పట్టణంలోని ఓ మొబైల్ షాప్‌నకు కన్నమేసిన నిందితుడు పదుల సంఖ్యలో కొత్త మొబైల్స్ ఉన్నా.. కేవలం రెండు పాత సెల్‌ఫోన్స్, రూ.2వేల నగదు ఎత్తుకెళ్లాడు. ఈ ఘటన తాండూరు టౌన్ పీఎస్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన ప్రకారం.. తెల్లవారు జామున 3గంటల ప్రాంతంలో పట్టణంలోని నందీశ్వర మొబైల్ షాప్ పైకప్పు ధ్వంసం చేసి దుకాణంలోకి వెళ్లాడు. సీసీ కెమెరాకు చిక్కకుండా ముఖంపై చొక్కా కప్పుకొని సీసీ కెమెరాను పక్కకు తిప్పాడు. అప్పటికే మరో కెమెరాలో అతని కదలికలు రికార్డు అయ్యాయి. కాసేపు దుకాణంలో కూర్చున్న నిందితుడు యజమాని ఫోన్, రిపేర్‌కు ఇచ్చిన మరో ఫోన్, కౌంటర్‌లో ఉన్న రూ.2వేల నగదు తీసుకుని వచ్చిన దారిలోనే వెళ్లిపోయాడు. ఉదయం షాప్ తెరిచిన యజమాని శివకుమార్ చోరీ జరిగినట్లు గుర్తించి కేవలం రెండు ఫోన్లు, నగదు చోరీకి గురైనట్లు నిర్ధారించుకున్నాడు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

చినుకు చిటపట.. మెట్రో కిటకిట



- రోజుకు సుమారు 5 లక్షల మందికిపైగా ప్రయాణం
- కిక్కిరిసిపోతున్న రైళ్లు

సాక్షి, సిటీబ్యూరో: చినుకు పడితే చాలు మెట్రో రైళ్లు కిక్కిరిసిపోతున్నాయి. ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా మెట్రో రైళ్లకు డిమాండ్ పెరిగింది. రహదారులను ముంచెత్తే వరదలు, ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా నగరవాసులు మెట్రోలను ఆశ్రయిస్తున్నారు. దీంతో రైళ్లలో రద్దీ విపరీతంగా పెరిగింది. ఐటీ సంస్థల్లో పని చేసే సాఫ్ట్‌వేర్ నిపుణులు, ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో పని చేసే చాలా మంది ఉద్యోగులు, విద్యార్థులు సకాలంలో చేరుకొనేందుకు మెట్రోలనే ఎంపిక చేసుకుంటున్నారు. దీంతో రోజుకు వెయ్యి ట్రిప్పులకు పైగా నడిచినా ప్రయాణికుల రద్దీ మేరకు రైళ్లు అందుబాటులో ఉండడం లేదు. ప్రస్తుతం ప్రతి రోజు సుమారు 4.8 లక్షల నుంచి 5 లక్షల మందికి పైగా రాకపోకలు సాగిస్తున్నారు. ఏటేటా ప్రయాణికుల సంఖ్య పెరుగుతూనే ఉంది. కానీ రద్దీ మేరకు అదనపు సర్వీసులు మాత్రం అందుబాటులోకి రావడం లేదు. కోచ్‌ల సంఖ్యను పెంచేందుకు హైదరాబాద్ మెట్రో రైల్ గత సంవత్సరమే ప్రణాళికలను రూపొందించింది. కానీ ఇప్పటి వరకు ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం గమనార్హం. నగరంలోని మూడు ప్రధాన కారిడార్‌లలో మెట్రో రైళ్లు ప్రతి రోజు 1034 ట్రిప్పులు తిరుగుతున్నాయి. గత ఏడాది జూలైలో అదనపు మెట్రోలకు ప్రతిపాదనలను చేశారు. నాగపూర్ నుంచి లీజు ప్రాతిపదికన కోచ్‌లను తెప్పించనున్నట్లు అప్పట్లో అధికారులు ప్రకటించారు. కానీ ఇప్పటి వరకు ఎలాంటి పురోగతి లేకుండాపోయింది.

అడవుల సంరక్షణపై అవగాహన అవసరం

ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కోర్స్ డైరెక్టర్ రంగారెడ్డి

అనంతగిరి: అడువులపై అవగాహన కలిగి ఉండాలని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కోర్స్ డైరెక్టర్ రంగారెడ్డి అన్నారు. శనివారం తెలంగాణ ఫారెస్ట్ అకాడమీలో శిక్షణ పొందుతున్న 35వ బ్యాచ్ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు 33 మంది వికారాబాద్‌లో జరుగుతున్న అటవీ శాఖ పనులు, అనంతగిరి ప్రాంతాన్ని శిక్షణలో భాగంగా సందర్శించారు. ఈ సందర్భంగా గంగారెడ్డి మాట్లాడుతూ.. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు అటవీ సంరక్షణలో అత్యంత సునిశత్వాన్ని కలిగి ఉండాలన్నారు. ప్రస్తుతం అటవీ సంరక్షణ సంక్లిష్టంగా మారినందున ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు పనితీరును మెరుగుపరుచుకోవాలని సూచించారు. అటవీ సంరక్షణ ఒక సోషల్ వర్క్ లాంటిదని.. సమాజంలోని ప్రతీ ఒక్కరిని కలుపుకొని పోతూ అడవులను సంరక్షించాలని జిల్లా అటవీశాఖ అధికారి జ్ఞానేశ్వర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్యాం కుమార్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ అరుణ, ఫారెస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.



ట్రైనీ ఎఫ్‌బీఓలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు